క్లుప్తంగా

అనంతరామయ్యకు నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): బహుముఖ ప్రజ్ఞాశాలి అనంతరామయ్య అని సీపీఐ సీనియర్ నేత రామరాజు పేర్కొన్నారు. సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో వేములపాటి అనంతరామయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, దయాశంకర్, జిలానీబాషా, షానవాజ్, నాగేంద్ర, లీలామోహన్ తదితరులు పాల్గొన్నారు.

భరోసా కల్పిస్తూ.. పింఛన్‌ను అందజేస్తూ

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని 25 – 2 వార్డు సచివాలయ పరిధిలో వృద్ధుడు శ్రీరాములు కొన్నేళ్లుగా పింఛన్‌ను పొందుతున్నారు. ఈ క్రమంలో ఆస్తమా కారణంగా ఆయన శుక్రవారం ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వలంటీర్ సంధ్య వృద్ధుడి వేలిముద్రలు తీసుకొని కుటుంబసభ్యులకు పింఛన్ నగదును అందజేశారు. 108కు సమాచారమిచ్చి వైద్యసేవల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. స్థానిక వార్డు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

పన్నులపై వడ్డీ మాఫీ



మాట్లాడుతున్న చెన్నుడు

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆస్తి, ఖాళీ స్థల పన్నుల బకాయిలను ఒకేసారి చెల్లిస్తే అపరాధ రుసుమును మాఫీ చేయనున్నామని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, అమెనిటీస్ కార్యదర్శులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 31లోపు చెల్లిస్తే ఈ అవకాశం వర్తించనుందని వివరించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పన్నుల కౌంటర్ లేదా cdma. ap. gov. inలో చెల్లించొచ్చని చెప్పారు. అనంతరం ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ సంపత్‌కుమార్ మాట్లాడారు. నీటి, డ్రైనేజీ పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కార్యదర్శులకు సూచించారు. అదనపు కమిషనర్ శర్మద, రెవెన్యూ అధికారులు శ్రీనివాసులు, సమద్, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా 'రత్నం' వార్షికోత్సవం

నెల్లూరు (టౌన్): రిత్విక్ ఎన్‌క్లేవ్‌లోని రత్నం స్కూల్లో ముగ్ద ది జాయ్ ఆఫ్ డ్యాన్స్ పేరిట వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. విద్యాసంస్థల డైరెక్టర్లు కృష్ణకిషోర్, వాసంతికిషోర్, జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, ప్రిన్సిపల్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



వెంకటాచలం: అంతర్జాతీయ వీల్‌చైర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని సరస్వతీనగర్ వద్ద ఉన్న దివ్యాంగుల ప్రాంతీయ సంయుక్త కేంద్రం(సీఆర్సీ)లో దివ్యాంగులకు వీల్‌చైర్స్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఆర్సీ డైరెక్టర్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సీఆర్సీలో దివ్యాంగులకు పలు కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

పొదలకూరు : మండలంలోని సంగం–పొదలకూరు మార్గంలో ఉన్న కిసాన్ క్రాఫ్ట్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. సైదాపురం మండలం మునగపాడు గ్రామానికి చెందిన వినోద్ బైక్‌పై మహ్మదాపురం గ్రామానికి వివాహానికి హాజరయ్యేందుకు బయలుదేరాడు. కిసాన్‌క్రాఫ్ట్ సమీపంలో బైక్ అదుపుతప్పడంతో వినోద్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని 108 సిబ్బంది పొదలకూరు సీహెచ్‌సీకు తరలించారు.

వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- పార్టీలో 50 మంది చేరిక



రజనీని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానాన్ని కల్పించడంతో పాటు అండగా ఉంటామని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 29వ డివిజన్లోని వెంకటరెడ్డినగర్, గాంధీనగర్ ప్రాంతాలకు చెందిన 50 మంది యువకులు టీడీపీని వీడి జయంత్ ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. నగరంలోని తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి పార్టీ కండువాలను కప్పి ఎంపీ సాదరంగా ఆహ్వానించారు. కార్పొరేటర్ సత్తార్, జేసీఎస్ కన్వీనర్ కొండా సాయిరెడ్డి, మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- నియోజకవర్గంలోని 29వ డివిజన్‌కు చెందిన మాజీ టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు, వడ్డెర సంఘ జిల్లా మహిళా అధ్యక్షురాలు వల్లెపు రజనీ ఎంపీ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. నేతలు అమర్‌నాథ్, జకీర్, హరిరెడ్డి, సూరిబాబు, రామిరెడ్డి, వినోద్, రఫీ, నిస్సార్, అంజద్, జాహీద్ తదితరులు పాల్గొన్నారు.

12వ డివిజన్ కార్యకర్తలతో సమావేశం



నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని 12వ డివిజన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నగరంలోని తన కార్యాలయంలో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశనం చేశారు. పార్టీ కోసం కలిసికట్టుగా పని చేయాలని కోరారు. కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. మేయర్ స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎంబేటి ఏసునాయుడు, డివిజన్ అధ్యక్షుడు జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించండి



ప్రచారం చేస్తున్న ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 54వ డివిజన్లో గల భగత్‌సింగ్‌కాలనీ, ఆరో డివిజన్లోని ఉడ్‌హౌస్ సంఘం, వైటీ నాయుడువీధి తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్ అహ్మద్ మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ చేసిన అభివృద్ధితో పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి గడప గడపకూ వెళ్లి ప్రచారం చేస్తున్నామని చెప్పారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఎవరికి ఏ అవసరమొచ్చినా ముందుండి పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఖలీల్ అహ్మద్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్పొరేటర్లు సఫియాబేగం, మద్దినేని మస్తానమ్మ, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు జమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు



నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామ పూజలను శుక్రవారం నిర్వహించారు. పల్లకిసేవను నేత్రపర్వంగా జరిపారు. సాయిలలితా కూచిపూడి నృత్యనికేతన్ ఆధ్వర్యంలో శిరీష శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం అలరించింది. ఉభయకర్తలుగా బాలాజీసింగ్, లక్ష్మి దంపతులు వ్యవహరించారు. ధర్మసింగ్, ఈఓ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు సంచరిస్తే చర్యలు



గోశాలకు ఆవుల తరలింపు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన రోడ్లపై పశువుల సంచారాన్ని నిషేధించామని, నిబంధనలను ఉల్లంఘిస్తే పశు యజమానులకు జరిమానాలు విధిస్తామని ఎంహెచ్ఓ వెంకటరమణ పేర్కొన్నారు. ఏసీ మార్కెట్ సమీపంలోని రోడ్డుపై సంచరిస్తున్న ఆవులను ప్రత్యేక వాహనాల ద్వారా కల్లూరుపల్లిలోని గోశాలకు శుక్రవారం తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరంలోని అన్ని ప్రధాన రోడ్లపై ప్రత్యేక బృందాలతో స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. పశువులను తమ పరిసర ప్రాంతాల్లో ఉంచుకోవాలని యజమానులకు సూచించారు. వెటర్నరీ వైద్యాధికారి మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్కే ట్రస్ట్ ప్రారంభం నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఏఆర్కే చారిటబుల్ ట్రస్ట్‌ను శనివారం సాయంత్రం ప్రారంభించనున్నామని ట్రస్ట్ అధ్యక్షుడు కొండూరు హరినారాయణరెడ్డి తెలిపారు. మాగుంట లేఅవుట్లోని ట్రస్ట్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ట్రస్ట్ కార్యదర్శి కృపావతి, కోశాధికారి హనోక్, ట్రస్టీలు రాయ్‌జేసన్, మురళీమోహన్‌రాజు, కృపాల్, బాలయ్య పాల్గొన్నారు.

పరిశ్రమల నిర్వహణ వివరాలపై సర్వే చేయండి

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సచివాలయాల పరిధిలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలను గుర్తించి, వాటి నిర్వహణ వివరాలపై సర్వే చేయాలని అదనపు కమిషనర్ శర్మద సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో అమెనిటీస్ కార్యదర్శులకు శిక్షణను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తయారీ.. సేవలు.. వాణిజ్య.. రిటైల్ రంగాల ద్వారా నిర్వహిస్తున్న పరిశ్రమల సమగ్ర సమాచారాన్ని సర్వే ద్వారా సేకరించి ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. ఎమ్మెస్సెమ్ఈ యాప్‌ను ఉపయోగించి సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యం



సమస్యలను తెలుసుకుంటున్న తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): పోలీస్ సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యమని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించారు. వివిధ సమస్యలపై ఎస్పీకి వినతిపత్రాలను సిబ్బంది అందజేశారు. వీటిని పరిశీలించిన ఆయన త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏఎస్పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

నెల్లూరు(క్రైమ్): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని.. మోసానికి గురైతే పోలీసులకు తక్షణమే ఫిర్యాదు చేయాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. సైబర్ నేరాలు, మోసాలకు గురికాకుండా పాటించాల్సిన జాగ్రత్తలను నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఆయన వివరించారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేద్దామనుకునే వారిని లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితో షేర్ చేయరాదని, సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయొద్దని సూచించారు. జిల్లాలో ప్రీపెయిడ్ టాస్కుల ఫ్రాడ్ ద్వారా రూ.13 లక్షలు, నకిలీ వెబ్‌సైట్లలో ఇన్వెస్ట్‌మెంట్ పేరిట రూ.10 లక్షలు, యూట్యూబ్‌లో వీడియోలకు లైక్‌లు, రివ్యూల ద్వారా అధిక నగదును సంపాదించొచ్చని రూ.9.5 లక్షలు, విమాన టికెట్లు బుక్ చేస్తే అధిక నగదును సంపాదించొచ్చని రూ.3.5 లక్షల మేర సైబర్ నేరగాళ్లు కాజేశారనే ఫిర్యాదులు అందాయన్నారు. సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన సైబర్‌మిత్ర వాట్సాప్ నంబర్ 91212 11100, 1930, ఎన్సీఆర్పీ పోర్టల్ cybercrime.gov.in లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తే తగు చర్యలు చేపడతారని చెప్పారు.

పీహెచ్‌సీల్లో తనిఖీలు



నెల్లూరు(అర్బన్): నవాబుపేట రైతుబజార్ సమీపంలోని అర్బన్ పీహెచ్‌సీతో పాటు అల్లీపురం పీహెచ్‌సీని ఏడీఎంహెచ్ఓ, జిల్లా క్షయ నివారణాధికారి ఖాదర్‌వలీ శుక్రవారం తనిఖీ చేశారు. బీసీజీ, పల్స్‌పోలియో టీకాలపై తనిఖీ చేసి డాక్టర్లకు, వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. టీకాల వివరాలపై రికార్డులను పూర్తిస్థాయిలో నిర్వహించాలని కోరారు. జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గురుకుల పాఠశాలల పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు(వీఆర్సీ సెంటర్): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలకు సంబంధించిన పోస్టర్లను ఆటోనగర్‌లోని ఏపీ గురుకుల పాఠశాలలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా గురుకుల పాఠశాలల కన్వీనర్ మురళీకృష్ణ మాట్లాడారు. గండిపాళెం, నెల్లూరు (బాలురు), ఆత్మకూరు, తుమ్మలపెంట (బాలికలు) విద్యాలయాల్లో 2024 – 25 విద్యాసంవత్సరంలో 5, 6, 7, 8వ తరగతుల్లో చేరేందుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మార్చి 31లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని.. ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారని వివరించారు. వివరాలకు 87126 25045 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. డీఈఓ రామారావు, గండిపాళెం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు



బహుమతులను అందజేస్తున్న డీఈఓ

నెల్లూరు (టౌన్): 'టేక్ ఎ రైట్ స్టార్ట్.. బికం ఫైనాన్షియల్లీ స్మార్ట్' అనే అంశంపై కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ రామారావు అందజేశారు. లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ ప్రదీప్, నాబార్డు డీడీఎం రవిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇక్కట్లు తలెత్తకూడదు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న మలోల, తదితరులు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అధికార యంత్రాంగం సమన్వయంతో విధులు నిర్వర్తించి.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆర్డీఓ మలోల పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని దేవస్థానంలో శుక్రవారం నిర్వహించారు. ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆదివారం రాత్రి ఏడు గంటలకు అంకురార్పణ జరగనుందని తెలిపారు. 15వ తేదీ వరకు రోజూ విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారని వివరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఈఓ ఆరంబాకం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పంచామృతాభిషేకం



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మూలవర్లకు పంచామృతాభిషేకం, తిరుప్పావై సేవను శుక్రవారం నిర్వహించారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో ఎస్పీ పరిశీలన



నెల్లూరు(క్రైమ్): నగరంలోని డీకేడబ్ల్యూ, సర్వోదయ కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. భద్రత ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పరీక్షల నిర్వహణకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామని వివరించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నామన్నారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఎస్బీ, చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారెడ్డి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



నెల్లూరు (టౌన్): వయోజన విద్య కార్యక్రమంలో భాగంగా 50 మంది ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని కొండాయపాళెం రోడ్డులోని జీసస్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వీరికి సర్టిఫికెట్లను శుక్రవారం అందజేశారు. రైట్ లైఫ్ సంస్థ కోఆర్డినేటర్ జైపాల్‌రెడ్డి, జాన్సన్, నాగేశ్వరరావు, ప్రసాదరావు, జయరావు, రేవతి, కృష్ణారెడ్డి, ప్రభుదాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.